## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశం ప్రపంచంలోని అత్యంత పురాతన జీవన నాగరికతను కలిగి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- రాజ్యాంగ ప్రవేశిక అనేది రాజ్యాంగానికి ఆత్మ వంటిదని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధనఖర్ పేర్కొన్నారు.
- భారత రాజ్యాంగం అన్ని సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు.
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ISS లో ఉన్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సంభాషించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ప్రపంచంలోని అత్యంత పురాతన జీవన నాగరికతను కలిగి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. తత్వశాస్త్రం, జ్ఞాన సంపద వేల సంవత్సరాలుగా దేశ ఆలోచనలలో నిలిచి ఉందన్నారు. న్యూఢిల్లీలో అచార్య విద్యానంద్ మహారాజ్ శత వార్షికోత్సవాలను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆచార్య విద్యానంద్ తన జీవితమంతా కేవలం ఆధ్యాత్మిక సాధనకు పరిమితం చేసుకోలేదని సంస్కృతిని పునరుద్ధరించడానికి కృషి చేశారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ బైట్.. 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగ ప్రవేశిక అనేది రాజ్యాంగానికి ఆత్మ వంటిదని భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధనఖర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగ ప్రవేశిక రాజ్యాంగం మొత్తానికి ఆధారంగా ఉందని గుర్తు చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన సమయంలో రాజ్యాంగం కొంత మార్పుకు గురయిందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రజల హృదయాలలో జీవిస్తున్నారని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగం అన్ని సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ లో రాజ్యాంగ ప్రవేశిక పార్క్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య

అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఒక ప్రత్యేక రాజ్యాంగం అనే ఆలోచనను ఎప్పుడూ ఇష్టపడలేదని అన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. ఒకే రాజ్యాంగం కింద ఐక్య భారత్ అనే డాక్టర్ అంబేద్కర్ దార్శనికత నుంచి సుప్రీంకోర్ట్ ప్రేరణ పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. నాగపూర్ లో రాజ్యాంగ ప్రవేశిక పార్క్ భారత రాజ్యాంగం సువర్ణ జయంతి సంవత్సరంలో స్థాపించబడిందని తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. రాజ్యాంగం రూపంలో అంబేద్కర్ దేశానికి ఇచ్చిన విలువైన బహుమతి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (RAW) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ ఈరోజు నియమితులయ్యారు. ప్రస్తుతం రా అధిపతిగా ఉన్న రవిసిన్హా ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే పరాగ్ జైన్ బాధ్యతలను స్వీకరిస్తారు. జులై 1 నుంచి ఆయన రెండేళ్ల పాటు ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. పరాగ్ జైన్ పంజాబ్ క్యాడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన రా లోని ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ (ARC) విభాగానికి సారథ్యం వహిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సంత్రగచ్చి రైల్వే స్టేషన్‌లో పూరూలియా - బ్యాంకురా - హౌరా మధ్య ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం ఆయన అమృత భారత్ స్టేషన్ పథకం పురోగతిని పరిశీలించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ISS లో ఉన్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సంభాషించారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం చేరుకోవడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా శుభాంశు శుక్లా అన్నారు. తాను అక్కడ సురక్షితంగా ఉన్నానని ప్రధానమంత్రికి తెలిపారు. కాగా శుభాంశు శుక్లా భూమికి దూరంగా ఉండొచ్చుగానీ, భారతీయుల హృదయాలకు దగ్గరగా ఉన్నారని ప్రధానమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఇరువురు సంభాషించుకుంటూ...

(వాయిస్ బైట్...36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ భూమిలోని చెట్లను తొలగించివేయడాన్ని కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త నియమావళిని విడుదల చేసింది. ఇది వ్యవసాయ భూమి దృఢత్వాన్ని ప్రోత్సహిస్తుంది. అదే విధంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, అటవీ ప్రాంతాల విస్తీర్ణాన్ని పెంచడం, చెట్లను అధికంగా ఉంచేలా చేయడం, వాతావరణంలో పెను మార్పులు లేకుండా నిరోధించడం వంటి వాటికి దోహదపడుతుంది. పారిస్ ఒప్పందంలో భాగంగా భారతదేశం వాతావరణ సమతుల్యత లక్ష్యాలను కూడా సాధించేందుకు ఈ విధానం ఉపకరిస్తుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఈ నియమావళిని పంపించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని అయోధ్యలో రామాలయానికి ప్రతీరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. 2024, జనవరి 22వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రామాలయాన్ని ప్రారంభించారు. ఆనాటి నుంచి ఈరోజు వరకూ సుమారు 5 కోట్ల 50 లక్షల మంది భక్తులు అయోధ్య రాముడిని దర్శించుకున్నారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. సాధారణ ప్రజలే కాకుండా కేంద్ర మంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు సహా సుమారు నాలుగున్నర లక్షల మంది ప్రముఖులు అయోధ్య రాముడిని దర్శించుకున్నారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని 13 మంది మావోయిస్టులు ఈరోజు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 8 మంది మహిళలు ఉన్నారని ఆ రాష్ట్ర పోలీసులు తెలిపారు. వారి మీద 23 లక్షల రూపాయల రివార్డు ఉందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన నిబంధనల ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని పోలీసులు తెలిపారు. అలాగే.. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు చొప్పున అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని పోలీసులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నేపధ్యంలో అక్కడ ఉన్న  భారతీయుల్ని రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నెల 18న ప్రారంభమైన ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల నుంచి దాదాపు 4,415 మందికి పైగా భారతీయుల్ని స్వదేశానికి చేర్చామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 19 ప్రత్యేక విమానాల ద్వారా భారతీయ పౌరులను తరలించామని పేర్కొంది. అందులో ఇరాన్ నుంచి 3,597 మంది, ఇజ్రాయెల్ నుంచి 818 మంది ఉన్నారని తెలిపింది. మరోవైపు రెండు దేశాల మధ్య కాల్పుల విరమణతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. దీంతో ప్రస్తుతం ఈ ఆపరేషన్‌ని నిలుపుదల చేశామని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత దేశ అభివృద్ధిలో పీవీ నరసింహారావు నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. దివంగత నేత పూర్వ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా ఆయన స్పందించారు. ఆయన సమర్థ నాయకత్వంతో దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =